క్లుప్తంగా

'పెద్దింటి'కి జీహెచ్‌పీయూ డాక్టరేట్ ప్రదానం



చెన్నైలో ప్రముఖుల చేతుల మీదుగా డాక్టరేట్ అందుకుంటున్న పెద్దింటి రామం

కొత్తపేట: స్థానిక పురోహితుడు పెద్దింటి రామ చంద్రశ్రీహరి (రామం)కు అమెరికాకు చెందిన గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్సిటీ (జీహెచ్‌పీయూ) గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ మేరకు శనివారం సాయంత్రం చెన్నైలోని భారత విద్యాభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్ పి.మానుయుల్ ఆధ్వర్యంలో ముఖ్యఅతిథులు జడ్జి కె.వెంకటేశన్, ఐఏఎస్ అధికారి సంపత్‌కుమార్, ఆల్ ఇండియా హజ్ కమిటీ చైర్‌పర్సన్ మనావలీబేగం, చెన్నై పోలీస్ కమిషనర్ కె.రాజారామ్‌ల చేతుల మీదుగా రామంకు గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసి, భారత కళారత్న బిరుదు, నంది పురస్కారం, మూడు సర్టిఫికెట్లు అందజేసింది. ఈ సందర్భంగా రామం మాట్లాడుతూ అమెరికాకు చెందిన జీహెచ్‌పీయూ గుర్తింపు పొంది ప్రతిష్టాత్మక డాక్టరేట్, భారత కళారత్న బిరుదు, నంది పురస్కారం పొందడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.

చరిత్ర అధ్యాపకుడు రాజేష్‌కు గోల్డ్ మెడల్



నేదూరి రాజేష్

మామిడికుదురు: మండలంలోని పెదపట్నం గ్రామానికి చెందిన నేదూరి రాజేష్‌ను ఆంధ్రా యూనివర్సిటీ స్నాతకోత్సవ సభలో చరిత్ర విభాగం నుంచి గోల్డ్ మెడల్‌తో సత్కరించారు. వైస్ చాన్స్‌లర్, ప్రొఫెసర్ పీవీజీడీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. రాజేష్ ప్రస్తుతం మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. చరిత్రపై రాజేష్ పలు పరిశోధనలు చేశారు. బౌద్ధ స్థూపాలు, కాకతీయుల చరిత్రపై పలు విశ్లేషణలు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో మన దేశ చరిత్ర ఎంతో గొప్పదన్నారు. చరిత్ర ఆధారాల విశ్లేషణల ద్వారా చరిత్ర పరిరక్షణకు నిరంతరం కృషి చేసేందుకు ఈ అవార్డు తనకు మరింత స్ఫూర్తిగా నిలుస్తుందని రాజేష్ పేర్కొన్నాడు.

గణపతి నవరాత్రులకు పందిరిరాట

అంబాజీపేట: రానున్న గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని అంబాజీపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న గణపతి ఆలయం వద్ద పందిరిరాట ముహూర్తాన్ని ఆదివారం నిర్వహించారు. ఆలయ అర్చకులు మర్ల శ్రీనివాసశర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకుడు కామిశెట్టి మదుభాబు ప్రత్యేక పూజలు చేశారు. గణపతి నవరాత్రులను పురస్కరించుకుని వినాయకుడికి ప్రత్యేక అలంకరణలు రోజూ చేస్తామన్నారు. ఆలయ ప్రాంగణంలో భారీ అన్నసమారాధన చేపడతామన్నారు. మండలంలో ముక్కామల, గంగలకుర్రు, చిరతపూడి, వాకలగరువు, నందంపూడి, తొండవరం గ్రామాల్లో గణపతి నవరాత్రుల పందిరిరాట ముహూర్తాలు చేశారు.

ఉన్నత పాఠశాలకు ల్యాప్‌టాప్ బహూకరణ



హెచ్‌ఎం నిరంజనికి ల్యాప్‌టాప్ అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

మామిడికుదురు: స్థానిక గోకవరపు గణాధిపతి జెడ్పీ ఉన్నత పాఠశాలకు పూర్వ విద్యార్థులు ఆదివారం ల్యాప్‌టాప్ బహూకరించారు. 1972–73 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల సమావేశం జరిగింది. పూర్వ విద్యార్థి రిటైర్డ్ జాయింట్ కలెక్టర్ బద్దే వీవీ సత్యనారాయణమూర్తి, జాన మల్లికార్జునరావు స్పాన్సర్ చేసిన ల్యాప్‌టాప్ సిస్టంను స్కూల్ హెచ్‌ఎం సీహెచ్ నిరంజనికి అందజేశారు. ఈ సందర్భంగా రిటైర్డ్ జేసీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ తాము చదువుకున్న ఉన్నత పాఠశాల అభివృద్ధిలో తాము భాగస్వాములం కావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ల్యాబ్ కన్వీనర్ జాలెం రాంబాబు, సభ్యులు రాయుడు పెద్దిరాజు, రాజారత్నం, కళిలంక సత్యనారాయణ, రాయుడు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న నిత్యాన్నదాన భవన నిర్మాణానికి మెదక్ జిల్లా తెల్లాపూర్‌కు చెందిన ఆర్.సుబ్రహ్మణ్యం–రోజా దంపతులు రూ.38,700 విరాళం అందించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. దాతకు ఆయన చేతుల మీదుగా స్వామి చిత్రపటం అందజేశారు. నిత్యాన్నదాన భవన నిర్మాణానికి వెదిరేశ్వరానికి చెందిన ఎం.లక్ష్మీకుమార్‌రాజా రూ.20 వేలు, ఎస్.కాశీ విశ్వనాథరాజు–శారదాదేవి దంపతులు రూ.11,116, రాజమహేంద్రవరానికి చెందిన పి.నాగార్జున–సూర్యవీరవేణి దంపతులు రూ.10 వేలు, ఐ.పవన్‌కుమార్–ఫణికుమారి దంపతులు రూ.10,120, పాలకొల్లుకు చెందిన ఆర్.రామవెంకట సదాసాయి అభిషేక్ రూ.10,116, కడియం మండలం మాధవరాయుడుపాలేనికి చెందిన జి.లింగేశ్వరరావు, మాధవి దంపతులు రూ.10,116 విరాళం అందించినట్లు చైర్మన్, ఈఓ తెలిపారు.

కలవరపెడుతున్న గోదావరి కోత

- నదిలో కూలిపోతున్న కొబ్బరి చెట్లు
- లంకల్లో తీవ్రమైన నదీపాతం



అప్పనపల్లి వద్ద గోదావరిలో కూలిపోతున్న కొబ్బరి చెట్లు



అప్పనపల్లిలో వరదకు కొట్టుకుపోయిన గ్రోయిన్

మామిడికుదురు: వైనతేయ గోదావరి నదీ తీరంలోని లంక గ్రామాల్లో నదీపాతం తీవ్రంగా ఉంది. గోదావరి కోత రైతులను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. రూ.కోట్లు విలువైన భూములు ఏటా నదీ గర్భంలో కలసి పోతున్నాయి. రోజు రోజుకూ నదీపాతం ఉధృతిమించడంతో రైతులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. మామిడికుదురు మండలంలోని పెదపట్నం, అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, పాశర్లపూడిలంక, బాడిలంక, ఆదుర్రు గ్రామాల్లో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. కోత నివారణకు రివిట్‌మెంట్ల నిర్మాణంతో పాటు గ్రోయిన్లు ఏర్పాటు చేయాల్సి ఉంది.

కనుమరుగవుతున్న గ్రోయిన్లు...

గోదావరి నీటి ప్రవాహాన్ని మళ్లించి తద్వారా కోతను నివారించేందుకు గతంలో నిర్మించిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు గోదావరిలోకి జారిపోతున్నాయి. అప్పనపల్లి, పెదపట్నంలంక, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు తదితర గ్రామాల్లో ప్రస్తుతం ఇదే పరిస్థితి నెలకొంది. పై గ్రామాల్లో కొన్ని చోట్ల గ్రోయిన్లు, రివిట్‌మెంట్లు కనమరుగయ్యాయి. మరికొన్ని చోట్ల గ్రోయిన్లు పాడైపోవడంతో నదీపాతం మరింత ఎక్కువయిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కొట్టుకుపోయిన గ్రోయిన్లు, రివిట్‌మెంట్ల స్థానే నూతనంగా గ్రోయిన్లు నిర్మించాలని, రివిట్‌మెంట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

రివిట్‌మెంట్ నిర్మించాలి



గోదావరి కోత ప్రభావం తీవ్రంగా ఉంది. బి.దొడ్డవరంలో కోత నివాస గృహాలను సమీపించింది. కోత వల్ల ఎంతో సారవంతమైన భూములు నదీగర్భంలో కలసిపోతున్నాయి. నెల నెలా ఆదాయాన్నిచ్చే కొబ్బరి చెట్లు నదిలో కూలిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి. దీనిపై తక్షణం స్పందించాల్సిన ఆవశ్యకత ఉంది.

– వాకపల్లి వీరాస్వామి, బి.దొడ్డవరం

రైతులను ఆదుకోవాలి



వైనతేయ నదీతీరంలో కోత ప్రభావం తీవ్రంగా ఉంది. పెదపట్నం నుంచి గోగన్నమఠం వరకు ఉన్న తీర గ్రామాల రైతులు ఈ కోత వల్ల ఎంతో నష్టపోతున్నారు. కొబ్బరి తోటలతో పాటు కొబ్బరిచెట్లు నదిలో కూలిపోయి రైతులు తీవ్రంగా నష్టాల్ని చవిచూస్తున్నారు. కోత నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలి. ఆ దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నాం.

– కొమ్ముల చిన్న, పెదపట్నం

ప్రతిపాదనలు పంపించాం

వైనతేయ గోదావరి నదీతీరంలోని కుడి వైపు కోత నివారణకు రూ.82.73 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు రూపొందించి పంపించాం. అప్పనపల్లి, పెదపట్నంలంక గ్రామాల్లో రూ.60.73 కోట్లు, బి.దొడ్డవరం, పాశర్లపూడి, ఆదుర్రు గ్రామాల్లో రూ.22 కోట్లతో గ్రోయిన్లు, రివిట్‌మెంట్ నిర్మాణం కోసం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

– టీవీఎల్ఎస్ మూర్తి, హెడ్ వర్క్స్ ఏఈఈ, రాజోలు

పేదల అభ్యున్నతికి సీఎం విశేష కృషి

- రూ.5.98 కోట్లతో సీహెచ్‌సీ భవనం నిర్మాణం
- ప్రారంభించిన మంత్రి కారుమూరి, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



అలమూరులో సీహెచ్‌సీ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి కారుమూరి, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

అలమూరు: కుల, మత వర్గాలకతీతంగా పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి సీఎం జగన్ విశేష కృషి చేస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అలమూరులో కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డితో కలసి ఆయన ఆదివారం స్థానిక మెయిన్‌రోడ్డులో రూ.5.89 కోట్లతో నిర్మించిన 30 పడకల ప్రభుత్వ సామాజిక ఆస్పత్రి భవనం (సీహెచ్‌సీ)ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాసు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ నేలపూడి లావణ్య అధ్యక్షత వహించగా మంత్రి కారుమూరి, ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. తొలుత మంత్రి కారుమూరి మాట్లాడుతూ ప్రజలకు ప్రాథమిక అవసరాలైన విద్య, వైద్య సౌకర్యాలను మెరుగ్గా అందించేందుకు సీఎం జగన్ అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. మనబడి, నాడు–నేడు పథకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలను, ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారన్నారు. ఈనెల 15 నుంచి రాష్ట్రంలో 45 రోజుల పాటూ ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల వద్దకు ప్రభుత్వ ఆరోగ్య సేవలను విస్తరిస్తున్నారన్నారు. గతంలో భ్రష్టుపట్టించిన 104, 108 సేవలకు సీఎం జగన్ తిరిగి జీవం పోశారన్నారు. ఆరోగ్యశ్రీని తిరిగి గాడిలో పెట్టి ప్రజలకు వైద్యం అనంతరం విశ్రాంతి సమయంలో ఆరోగ్య ఆసరా పథకం ద్వారా ఆర్థిక సహాయం అందజేస్తున్నారన్నారు. ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నియోజకవర్గంలో అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలను చేపట్టిందన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న సుభిక్ష పాలనను తట్టుకోలేని ప్రతిపక్ష పార్టీలు ప్రభుత్వంపై బురద చల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. ప్రతి గ్రామంలో గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్లు నిర్మించిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య, వైద్యం అందించాలన్న సీఎం జగన్ స్ఫూర్తితో పని చేస్తున్నామన్నారు. ఇప్పటికే పూర్తి చేసిన కొత్తపేట సీహెచ్‌సీ ఆధునీకరణ భవనం, ర్యాలి పీహెచ్‌సీ భవనాలను అతి త్వరలోనే ప్రారంభిస్తామని ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం సీహెచ్‌సీ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించి భవనంలోని 42 బ్లాక్‌లను ప్రారంభించారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఏఎంసీ చైర్మన్ యనముదల నాగేశ్వరరావు, జెడ్పీటీసీలు కురుపూడి శ్రీనివాసరావు, తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని, పీఏసీఎస్ అధ్యక్షుడు నెక్కంటి వెంకట్రాయుడు, ఏజీపీ నామాల శ్రీనివాసు, డీసీహెచ్ఎస్ ఎన్.పద్మశ్రీరాణి, ఆర్‌డీఓ ఎం.ముక్కంటి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

మణిపూర్ బాధితులకు రెండో విడత సాయం



మణిపూర్ వెళ్తున్న పాస్టర్ల బృందానికి అభినందనలు తెలుపుతున్న గెద్దాడ నాగేశ్వరరావు

మలికిపురం: మణిపూర్ బాధితులకు రెండో విడత సహాయం అందించేందుకు మలికిపురం గ్రామానికి చెందిన పాస్టర్ కొల్లాబత్తుల ప్రభాకర్‌రావు ఆధ్వర్యంలో ఈనెల 11న బయలుదేరి వెళుతున్నట్లు జీఎన్నార్ ట్రస్ట్ అధ్యక్షుడు, ఎన్నారై డా.గెద్దాడ నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం మలికిపురంలోని ప్రభాకరరావు చర్చిలో జరిగిన పాస్టర్ల సమావేశంలో నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గత నెల రోజుల క్రితం మణిపూర్ బాధితులకు నిత్యవసరాలు, దుస్తులు, పిల్లలకు కావలసిన సామాన్లు అన్ని ఈ బృందం మణిపూర్ తీసుకువెళ్లి పంపిణీ చేశారని, మరోసారి సాయం చేసేందుకు వెళ్లే టీమ్ ఈ నెల 11న వెళుతున్నట్లు పేర్కొన్నారు. దాతలు ఎవరైనా ఉంటే బృందాన్ని సంప్రదించి అందించాలని ఆయన సూచించారు. పాస్టర్ ప్రభాకరరావుతో పాటు పాస్టర్లు కారుపల్లి విజయ్‌కుమార్, తాడి సుధాకిరణ్, గుర్రం రాజు వెళ్తున్నారని తెలిపారు. మణిపూర్ బాధితులకు సహాయ సహకారాలు అందించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. సమావేశంలో జగ్జీవన్‌రావు, దొండపాటి కిరణ్, మోకా శ్రీనుబాబు, నల్లి శాంతరాజు, నల్లి కిషోర్, సరెళ్ల డేవిడ్, నల్లి డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

కనకదుర్గమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ

అయినవిల్లి: మండలంలోని వెలువలపల్లిలో కొలువైన కనకదుర్గమ్మ ఆలయ పునః ప్రతిష్ఠ కార్యక్రమాలు ఆదివారం ఆలయ అర్చకులు వెలవలపల్లి శంభేశ్వరరావు, శ్రీరామ మణికంఠశేఖర్, నాగ వెంకటేష్‌ల పర్యవేక్షణలో మోతా సోమరాజు, సత్యవాణి దంపతులు చేతుల మీదుగా ఘనంగా జరిపారు. ఆలయ నిర్మాణ దాతలు అందే వీవీ నాగ మల్లేశ్వరరావు, దుర్గ దంపతులు గనిబాయ్ ఆర్థిక సాయంతో నిర్మించారు. ఆలయ కమిటీ సభ్యులు ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి విజయవంతం చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. పెద్ద ఎత్తున అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

మట్టి వినాయకుని పూజిద్దాం



వినాయకుని మట్టి విగ్రహాలను తయారు చేసిన చిన్నారులు

ఆత్రేయపురం: మట్టి వినాయకుని పూజిద్దాం, పర్యావరణాన్ని కాపాడుదామని ప్రముఖ ఇంద్రజాలికుడు చింతా శ్యామ్‌కుమార్, రిసోర్సు పర్సన్ మూర్తి అన్నారు. ఆదివారం మండలంలోని ర్యాలి గ్రామంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో చిన్నారులకు మట్టి వినాయకుల తయారీ శిక్షణ ఇచ్చారు. చిన్నారులు మట్టితో వినాయకుని విగ్రహాలు తయారు చేసి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో అనూస్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- రావులపాలెం సచివాలయం–2 పరిధిలో గడప గడపకూ..



రావులపాలెంలో మహిళకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

రావులపాలెం: వైఎస్సార్ సీపీ సారథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిన సంక్షేమ పథకాలు వివరించి, ప్రభుత్వ సేవల్లో ప్రజలకు ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రతి గడపకూ వస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా ఆదివారం రావులపాలెం మండలం రావులపాలెంలోని సచివాలయం-2 పరిధిలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, వైఎస్సార్ జంక్షన్, భద్రమాంకాళమ్మ పుంత రోడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని చెప్పే ధైర్యం ఇలా ప్రజల ముందుకు వచ్చిన ఏకైక సీఎం జగన్ మాత్రమేనన్నారు. తెలుగు రాష్ట్రాల్లోనే ఇది ఒక సువర్ణాధ్యాయమని జగ్గిరెడ్డి పేర్కొన్నారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీపీ కర్రి లక్ష్మీవెంకటనాగదేవి, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సాకా ప్రసన్నకుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, కార్యదర్శి దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

వివక్ష లేని సంక్షేమానికి నాంది



పాదలాడలో లబ్ధిదారుక పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

రాజోలు: కులం, మతం, పార్టీ వంటి ఎలాంటి వివక్ష లేని సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నాంది పలికిందని ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. ఆదివారం పాదలాడలో ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. పాదలాడలోని ఇందిరాకాలనీ, పంచాయతీ వీధి, గోనమండ వారి వీధి, ఇంజేటి వారి గ్రూపు ప్రాంతాల్లో ఎమ్మెల్యే రాపాక ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలను మంజూరు చేయడంలో నిష్పక్షపాతంగా వ్యవహరిస్తున్నామని, మధ్యవర్తులు, బ్రోకర్ల వ్యవస్థకు చెక్ పెట్టేందుకే సీఎం జగన్ వలంటీర్ వ్యవస్థను తీసుకువచ్చారన్నారు. అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో వలంటీర్లు విశేష కృషి చేస్తున్నారన్నారు. రెండు వేల జనాభాకు ఒక గ్రామ సచివాలయాన్ని ఏర్పాటు చేసి పరిపాలన వికేంద్రీకరణ చేశారన్నారు. దీంతో మండల కేంద్రానికి వెళ్లనవసరం లేకుండా అనేక సమస్యలను పరిష్కరించుకు వీలు కలుగుతుందన్నారు. బడుగు, బలహీన వర్గాలను అభ్యున్నతికి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందన్నారు. గతంలో ఎన్నడూ లేని రీతిలో సంక్షేమం విరాజిల్లుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌ను మళ్లీ రెండోసారి సీఎంగా విజయపథంలో నిలపాలన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ గుబ్బల రోజారమణి, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, గ్రామశాఖ అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి, మాజీ ఎంపీటీసీ గెద్దం సురేష్, కొల్లాబత్తుల సతీష్, మట్టా ఏడుకొండలు, పెస్సింగి వీవీ సత్యనారాయణమూర్తి, పంచాయతీ కార్యదర్శి ఎం.కృష్ణ, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహం అభినందనీయం



కొత్తపేటలో పేద విద్యార్థుల స్కాలర్‌షిప్స్ పంపిణీ సభలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాబి

కొత్తపేట: వాసవీ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఆర్యవైశ్యుల్లో పేద, ఉత్తమ విద్యార్థులకు ప్రోత్సాహం అభినందనీయమని జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు అన్నారు. నియోజకవర్గంలో కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలకు చెందిన ఆర్యవైశ్య పేద, ఉత్తమ విద్యార్థులకు వాసవీ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా స్కాలర్‌షిప్స్, ప్రతిభా పురస్కారాలు ప్రదానాన్ని ఆదివారం నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ ఆర్యవైశ్యుల్లో ప్రతి ఒక్కరూ ఉత్తమంగా చదివి ఎదగాలని ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. చారిటబుల్ ట్రస్ట్‌తో పాటు గాంధీ జయంతి, తదితర సందర్భాల్లో సేవా కార్యక్రమాలు చేస్తున్న కొత్తపేట ఆర్యవైశ్య సంఘాలను జిల్లాలో ఇతర సంఘాలు ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఒక్కొక్కరికి రూ.5 వేలు చొప్పున 120 మంది పేద్యార్థులకు స్కాలర్‌షిప్స్ కింద రూ.6 లక్షలు అందజేశారు. 36 మంది ఉత్తమ విద్యార్థులను ప్రతిభా పురస్కారం కింద శాలువా, మెమెంటో, మెడల్‌తో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సంఘం కార్యదర్శి కె.చిన వీరభద్రరావు, కోశాధికారి కె.కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు సత్యవరపు జమీందార్, ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి వై.రాంబాబు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల ఫీజులు చెల్లించండి

మలికిపురం: 2024 మార్చిలో జరగబోయే పబ్లిక్ పరీక్షలతో పాటు 2023 పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులు పరీక్షలు రాసేందుకు నిర్దేశించిన ఫీజులను చెల్లించాలని కేశనపల్లి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ వై.లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. 2023లో ఇంటర్ మొదటి సంవత్సరం ఫెయిల్ అయితే రూ.560, రెండే సంవత్సరం ఫెయిల్ అయితే రూ.1120, ఈ ఏడాది ద్వితీయ సంవత్సర విద్యార్థులు రూ.560 ఫీజు చెల్లించాలని ఆయన సూచించారు.

శరవేగంగా రహదారి మరమ్మతులు

అయినవిల్లి: మండలంలోని తొత్తరమూడి నుంచి కె.జగన్నాథపురం వరకు ఉన్న ఆర్‌అండ్‌బీ పనులు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఈ రహదారిని బాగు చేయాలని తొత్తరమూడి గ్రామస్తులు జిల్లా కలెక్టర్‌కు, ఆర్‌అండ్‌బీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఈ రోడ్డును జిల్లా జాయింట్ కలెక్టర్ పరిశీలించి తక్షణమే మరమ్మతులు ప్రారంభించారు. రోడ్డు మరమ్మతులు ప్రారంభించడంతో గ్రామస్తులు అధికారులను అభినందిస్తున్నారు. చాలా కాలంగా ఈ రహదారి అధ్వానంగా ఉందని ఏ అధికారి తమ రోడ్డును పట్టించుకోలేదన్నారు. ఇంత త్వరగా తమ రహదారి బాగుపడటంతో ఎంతో ఆనందంగా ఉందని చెబుతున్నారు.

తప్పు చేసిన ఏ ఒక్కరూ తప్పించుకోలేరు



ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: టీడీపీ అధినేత చంద్రబాబుకు 14 రోజులు రిమాండ్ విధిస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. తప్పు చేసిన ఏ ఒక్కరూ చట్టం నుంచి తప్పించుకోలేరన్నారు. చంద్రబాబు విషయంలో ఇదే రుజువైందని చిట్టిబాబు పేర్కొన్నారు. ఇంతకాలం చట్టం నుంచి తప్పించుకున్న చంద్రబాబుకు ఇక తప్పించుకునే అవకాశం లేదన్నారు. చంద్రబాబు తప్పులను సమర్థిస్తూ వచ్చిన ప్రతిపక్షాలు ఇప్పుడు ఏం సమాధానం చెబుతాయని చిట్టిబాబు ప్రశ్నించారు. కోర్టు తీర్పుపై ప్రతిపక్షాలు స్పందించాలని చిట్టిబాబు డిమాండ్ చేశారు. తప్పు ఎవరు చేసినా దాన్ని ప్రతి ఒక్కరూ ఖండించాల్సింది పోయి సమర్థించడం హర్షణీయం కాదన్నారు. రూ.కోట్లలో అక్రమాలకు పాల్పడిన చంద్రబాబుపై ప్రభుత్వం తీసుకున్న చర్యలను ప్రజలు స్వాగతిస్తున్నారని చిట్టిబాబు చెప్పారు.

ప్రజాప్రతినిధులకు సత్కారం

ఆలమూరు: ఆలమూరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డికి, ఇతర ప్రజా ప్రతినిధులకు ఆదివారం ఘన సత్కారం జరిగింది. స్థానిక పెద్ద కాలువ రోడ్డులో నూతనంగా నిర్మించనున్న శ్రీకృష్ణుడి ఆలయానికి భూమి పూజ చేసేందుకు విచ్చేసిన మంత్రి కారుమూరి, ఎమ్మెల్యే జగ్గిరెడ్డితో పాటు వైఎస్సార్ సీపీ సీనియర్ నేత మేడపాటి శ్రీనివాసరెడ్డి, యాదవ సంఘ నేత రావి వెంకటేశ్వరరావు, సర్పంచ్ నేలపూడి లావణ్య తదితరులను శ్రీకృష్ణ యాదవ సంఘం ప్రతినిధుల బృందం దుశ్శాలువా కప్పి పూలమాల వేసి మెమొంటోను బహూకరించి ఘనంగా సత్కరించింది. ఆలయ నిర్మాణానికి తమ వంతు విరాళంగా ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి రూ.లక్ష అందజేశారు.

ఎమ్మెల్యేకి పలువురి పరామర్శ

మామిడికుదురు: అనారోగ్యంతో హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం నగరంలోని స్వగృహంలో విశ్రాంతి తీసుకుంటున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబును ఆదివారం పలువురు పరామర్శించారు. అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి దేవస్థానం అర్చకులు మద్దాలి తిరుమల శింగరాచార్యులు, జ్యోత్స్నల సోమయాజులు ఎమ్మెల్యే చిట్టిబాబుకు స్వామి వారి ఆశీస్సులు అందించారు. సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని దీవించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్ కార్యక్రమంలో పాల్గొన్నారు. అముడా చైర్మన్ గొల్లపల్లి డేవిడ్‌తో పాటు పలువురు వైఎస్సార్ సీపీ నేతలు ఎమ్మెల్యే చిట్టిబాబును పరామర్శించి త్వరగా కోలుకోవాలని అభిలషించారు.

వాడపల్లి వెంకన్నకు అష్టోత్తర పూజలు

ఆత్రేయపురం: వాడపల్లి శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ఏడు శనివారాల నోము ఆచరించిన భక్తులు స్వామి వారి అష్టోత్తర పూజల్లో పాల్గొన్నారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ, నీరాజన మంత్రపుష్పం, పుణ్యాహవాచనం తదితర పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అష్టోత్తర పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఏర్పాట్లను ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్‌రాజు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

అంబాజీపేట: కుటుంబ కలహాల నేపథ్యంలో ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పురుగు మందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు. స్థానికులు, కుటుంబీకులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మాచవరం శివారు అంబేడ్కర్‌నగర్‌కు చెందిన యలమంచిలి తాతారావు స్థానిక మెట్లకాలనీ వద్ద కూల్ డ్రింక్‌లో పురుగుమందు కలిపి తాగాడన్నారు. అపస్మారక స్థితిలో ఉన్న తాతారావును స్థానికులు గుర్తించి అతడి బంధువులకు సమాచారమిచ్చారు. అనంతరం 108లో అమలాపురంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. కుటుంబ కలహాల కారణంగానే పురుగుమందు తాగి ఉంటాడని బంధువులు తెలిపారని 108 సిబ్బంది చెప్పారు.

నగరంలో నిరవధిక దీక్ష

మామిడికుదురు: టీడీపీ అధినేత చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నగరంలో టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు జాలెం సుబ్బారావు ఆదివారం నిరవధిక నిరాహార దీక్ష చేపట్టారు. ఆయన తన నివాస గృహం వద్ద 216వ నంబర్ జాతీయ రహదారి పక్కన టెంట్ వేసి ఆమరణ నిరవధిక దీక్షలో కూర్చున్నారు. అతనికి మద్దతుగా పలువురు రిలే నిరవధిక దీక్షల్లో కూర్చున్నారు.